# అభాగిని

'పల్లపోతు'

తెల్లవారింది. భానుడు తన అంబుల పొదితో వేటకు సంసిద్ధుడయ్యాడు; అతనిరాకకు ఆహ్వానాలు అందజేస్తున్నట్లుగా వేడిగాడ్పు లారంభమయ్యాయి; ప్రకృతి పడతిని పొందనున్న భానుడు ఆనందముతో ఆ ఆహ్వానాలు అందుకుంటున్నాడు.

పెళ్ళికి ముస్తాబైన పద్మ ఆదృశ్యాన్ని చూస్తూ అలాగే నిలబడింది. వేదనారేఖలు పొడసూపుతూ మొఖం నల్లగా వాడిపోయింది. ఒంటరిగానున్న పద్మహృదయం ఆలోచనాతరంగాల్లో, బుడగలు తేస్తుంది. పద్మకు జీవితమంతా అగమ్యగోచరంగాకన్పించింది. తన అందమంతా అడవిగాచిన వెన్నలయింది; తన యవ్వనం ఎడారిలో మాలతి;

"చదువు సంధ్యల్లో, గుణగుణాల్లో, అందచందాల్లో పద్మకు పద్మే సాటి! పద్మ అదృష్టవంతురాలు!" అని ఎంతోమంది అన్నారు. అవును— రూపవతి, గుణవతి, విద్యావంతురాలు కావటమే అదృష్టమయితే పద్మ నిజంగా అదృష్టవంతుల్లో అగ్రగణ్యురాలయ్యేది; పద్మకు భగవంతుడు చదువూ, అందం, తెలివితేటలూ అన్నీ ఇచ్చేడు; అయితే ఏం లాభం? ... వాటికి తోడుగా చిన్నలోటుగూడా కల్పించేడు; అది తలచుకున్నప్పుడెల్లా పద్మహృదయం జేవురించేది; అదిజ్ఞప్తికి వచ్చినప్పుడెల్లా పసిపాపవలె ఏడ్చేది; తన ఒంటరి జీవితాన్ని గూర్చి ఆలోచిస్తే పద్మగుండె బ్రద్దలయ్యేది. పెండ్లయిన ప్రతిపడతితోనూ పోల్చుకుని కుమిలిపోయ్యేది; లేత తమలపాకువంటి శరీరచ్చాయ; కొనతేరిన ముక్కూ, అరటాకులాంటి సున్నని పెదవులూ, లేతగులాబీల్లాంటి సన్నని చెక్కిళ్ళూ, నిముషనిముషానికీ నుదిటపై నాట్యంచేసే ముంగురులూ 'అచ్చంగా అపర దేవకన్యలావున్న తన సుందరాకృతిని చూసి ఉప్పొంగిపొయ్యేది... కానీ, ... ఆవిడకు దైవం కల్పించిన స్వల్పలోటు ఆ సుందర కోమలాంగి హృదయాన్ని ఛిన్నాభిన్నాలుగా చేసేది.

"... పొరుగింటి పుల్లమ్మగారమ్మాయికి పొట్టపొడిస్తే అక్షరంముక్కలేదు; దాని మొగుడు బి. ఎ. పాసయ్యాడు ... నా స్నేహితురాలు విమల వట్టి పిచ్చిది ... నీలమేఘచ్చాయను వెక్కిరించే, కారు మేఘల్లాంటి మొఖం; తెలివితేటలాశూన్యం— దాని భర్త యం. ఏ. పాసయ్యాడు... నాకు ప్రతి మగవాడు కోరుకునే లక్షణాలన్నీ ఉన్నాయి. మరి నాకిదేం ఖర్మ? ... నేనేం పాపం జేసుకున్నాను. దేనికైనా పెట్టిపుట్టాలి; ఇంతకీ అదృష్టం ఉండాలి!" అనికుమిలి పొయ్యేది.

తీరని కోరికలు ఆవేశంలో బుసలు కొట్టేవి త్రాచు పాముల్లా;
ఆరని ఆశలు అంతంలేని అంటు వ్యాధిలా వ్యాపించినవి;
మారని ఆశయాలు మనస్సులో బాణల్లా నాటుక పోయినవి;

...పెళ్ళికి వచ్చిన పేరంటాళ్ల పక, పకలు తనను పరిహరిస్తున్నట్లుగాతోచింది పద్మకు; హృదయంలో బ్రద్దలయ్యే అగ్ని పర్వతాలను, బాధగా బరువుగా ప్రవహించే కన్నీటిధారలతో ఆర్పేసుకుంది;

◆ ◆ ◆

పెండ్లి పందిరంతా పిన్నల, పెద్దలతో కళ, కళ

లాడుతుంది; వరుడు స్నేహితులకు ఆహ్వానాలిస్తున్నాడు; పద్మ చూపులు దారులు తీరిన యువక బృంధంపై కేంద్రీకరించాయి; ముఖ్యంగా బులుగు రంగు బుష్ షర్టునుధరించిన యువకునిపైనుండి దృష్టిని మరల్చాలంటే బాధగా వుంది పద్మకు ... ... అతనెక్కడో చూచినట్లుగా జ్ఞాపకం! అతనెవరు? ... నేనెక్కడ చూసేను? ... అబ్బ! ఎంత చక్కగా వున్నాడు! ... అతని సౌందర్యాన్ని చూస్తుంటే నా ఒళ్ళు జలదరిస్తుంది. అతనికీ, నాకు ఏమిటి సంబంధం?

పద్మ మనస్సులో సముద్రతరంగాల్లా ఆలోచనలు దొర్లినయ్!

'ధన, ధన' మని వాయిద్యాల మోతకు ఉలిక్కిపడి పద్మ మళ్ళా ఈ ప్రపంచంలో పడింది;

తనేం చేస్తున్నా, ఎంతమందిలోవున్నా ఏవో రెండు విశాల నేత్రాలు తనను వెదుకుతున్నాయనీ బులుగురంగు బుష్షర్టు గమనించకపోలేదు;

♦ ♦ ♦

ఒకరి నొకరు చూచుకోవటం పెదవులపైకి చిరునవ్వు తెచ్చుకోవటం, కాస్త హృదయాలను తేటబరచుకోవటం ... ఇది ప్రతినిమషమూ జరుగుతుంది; చిలిపిగా పద్మ కనుగవతో ఏదో బాసలాడుతున్నాడు; సన్నజాజులు కురిసే మందహాసంతో పద్మహృదయ వీణాతంతులను మీటి, అపూర్వమైన అమరగీతితో ఆమె వీనులకు విందుగొలుపుతున్నాడు; ... ఆనంద డోలికల్లో నూగుచున్న పద్మహృదయం ఒక్కసారిగా గగుర్పొడిచింది; ... ఎంత ధైర్యం! పెద్దపరిచయమున్నవాడిలా "పద్మా!" యని పేరు పెట్టి పిలుస్తున్నాడే! ఆహాఁ! ఎంత కమ్మని కంఠస్వరం! ... ఏనాడో ఎక్కడో పరిచయమున్న కంఠధ్వనిలావుంది; ... అతని సాహసానికి ఆశ్చర్యపడింది పద్మ! ఏదో భయంవేసింది; ... తన గదిలోకి వెళ్ళింది ఒక్క పరుగుతో, నిలువుటద్దముందు తన సౌందర్యాన్ని చూసుకుని సిగ్గుపడింది; అద్దంలో అతని ప్రతిమ పక, పకమంది; ... మీరెవరండీ? ... ఎందుకు నవ్వుతున్నారు? ... నేనందంగాలేనా? ... ఎవరోవస్తున్నశబ్ధం పద్మ సంభావణను నాశనం చేసింది; అతను పద్మను సమీపించేడు. భయంగా కళ్ళుప్పగించి నిల్చుంది. ... "పద్మా!" అన్నాడు నవ్వుతూ; ... శిలాప్రతిమయింది పద్మ! ... "నాగేశ్వరం ... నువ్వేనా? ... నిజంగా నువ్వేనా?" ... అంటూ అతని హృదయంలో తలదాచుకుంది; "ఇప్పుడు గుర్తించావా? పద్మా!" అంటూ తన హృదయానికిగాఢంగా హత్తుకున్నాడు.

రాత్రంతా తన అనిలా అంతఃస్థుల్లో విచ్చలవిడిగా విహరించినందుకు సూచనగా ఉదయ భాస్కరుని శ్వేత కిరణాలు సూటిగా మొఖంమీద నాటేవరకూ మెలుకువరాలేదు పద్మకు; భారంగా పడకమీదనుండి లేచి వళ్లు విరుచుకుంది; అద్దంలో తన అందాన్ని చూచుకుని కిలకిలమంది; గోడనున్న రాధాకృష్ణులను వెక్కిరిస్తూ బయటకొచ్చిన పద్మ మొఖం వాలిపోయింది. "రాత్రి మెయిలెక్కబోయి పొరపాటున బండిక్రింద పడి నాగేశ్వరం మరణించా"డన్న వార్త వినగానే ఆమె హృదయం గతుక్కుమంది;

మిణుకు, మిణుకుమని వెలుగుతున్న ఆశాజ్యోతి "టప్పు" మని ఆరిపోయింది. పద్మహృదయం నిశ్శబ్ధంగా రోదించింది.

డాక్టరు కే. యన్. కేసరిగారి రచన

## 'నా చిన్ననాటి ముచ్చట్లు'

వెల రు. 3-0-0 — పోస్టేజి ఉచితం

**అన్ని హిగిన్ బాదమ్స్ స్టాల్సులోను దొరుకుతవి.**